## బాబ్రీ మసీదును కూల్చినట్టే..
# భత్కల్ మసీదును కూల్చుతాం

**బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే వ్యాఖ్య**



బెంగళూరు, జనవరి 14: కర్ణాటకకు చెందిన బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తర కన్నడలోని భత్కల్ మసీదును కూల్చివేస్తామని అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 'అయోధ్యలోని బాబ్రీ మసీదును ఎలాగైతే కూల్చివేశామో ఉత్తర కన్నడలోని భత్కల్ మసీదును అలాగే కూల్చివేస్తాం. ఇది వందశాతం కచ్చితంగా జరుగుతుంది. ఇది నా నిర్ణయం కాదు.. హిందూ సమాజం నిర్ణయం' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన పోలీసులు కేసు నమోదు చేశారు.



## మోదీ విమర్శకుడినని టికెట్ ఆఫర్లొస్తున్నాయి

కోజికోడ్, జనవరి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు 'మూడు రాజకీయ పార్టీలు' టికెట్ ఆఫర్ చేస్తున్నాయని ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. అయితే తాను అనుసరిస్తున్న సిద్ధాంతం నచ్చి కాకుండా.. ప్రధాని మోదీ విమర్శకుడిగా ఉన్నానన్న కారణంతో ఆయా పార్టీలు తన వెంట పడుతున్నాయని శనివారం కోజికోడ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన తెలిపారు. అలాంటి ట్రాప్‌లో తాను పడబోనన్న ప్రకాశ్ రాజ్.. తనను సంప్రదించిన పార్టీలేవో చెప్పలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రకాశ్ రాజ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు.



## సొంత పార్టీ పెట్టే దమ్ముందా?

ముంబై, జనవరి 14: మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌పై శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆదివారం విమర్శల దాడి చేశారు. శివసేన, ఎన్సీపీ పార్టీలను చీల్చడం, దొంగిలించడం కాదని, దమ్ముంటే సొంత పార్టీ ప్రారంభించాలని సవాల్ చేశారు. 'ఒకరు తన మామ పార్టీని, మరొకరు వేరొకరి పార్టీని దొంగిలిస్తారు. వీరికి సొంతంగా పార్టీ పెట్టి, మాపై పోటీకొచ్చే ధైర్యం ఉందా?' అని షిండే, అజిత్ పవార్‌లను ప్రశ్నించారు. కాగా, సంజయ్ రౌత్ వ్యాఖ్యలపై సీఎం షిండే కూడా అదే స్థాయిలో స్పందించారు. తాము బాలాసాహెబ్ పార్టీని ముందుకు తీసుకెళ్తున్నామని, ఆయన సిద్ధాంతాలకు వదిలేసిన వాళ్లకు తమ గురించి మాట్లాడే హక్కు లేదని కౌంటర్ ఇచ్చారు.

## విదేశీ విద్యార్థుల రాకపై కెనడా ఆంక్షలు!

**త్వరలో కీలక నిర్ణయం**

టొరంటో, జనవరి 14: విదేశీ విద్యార్థుల రాకపై పరిమితులు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నామని కెనడా వలసల శాఖ మంత్రి మార్క్ మిల్లర్ ప్రకటించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ కెనడాలో విదేశీ విద్యార్థుల సంఖ్య పెరిగిపోతున్నదన్నారు. 'ఆంక్షల అంశంపై ప్రోవెన్షియల్ ప్రభుత్వాలతో చర్చలు జరపాల్సి వుంది. ప్రావిన్స్‌లు తమ బాధ్యతను నిర్వర్తించేలా చూడాలి' అని తెలిపారు. మరికొద్ది నెలల్లో ఆంక్షలు అమల్లోకి రావొచ్చునని చెప్పారు. కెనడాలో విదేశీ విద్యార్థుల సంఖ్య 2012లో 2,75,000 ఉండగా, 2022నాటికి 8 లక్షలకు చేరుకుంది. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ఇండ్ల కొరతకు వలసలు ప్రధాన కారణమని ట్రూడో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. వలసల్ని నియంత్రించటంలో, ఇండ్ల కొరత సంక్షోభాన్ని పరిష్కరించటంలో ప్రభుత్వం విఫలమైందని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థుల రాకపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తున్నది.

# శంకరాచార్యులు ఏం చేశారు?

## హిందూ మతానికి ఏమైనా సేవ చేశారా?

### కేంద్ర మంత్రి నారాయణ్ రాణె వ్యాఖ్య

### పదవి నుంచి తొలగించాలని విపక్షాల డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 14: అయోధ్యలో జరిగే ప్రాణ ప్రతిష్ఠకు హాజరు కాబోమని, ఆ కార్యక్రమం పూర్తిగా రాజకీయ కార్యక్రమంలా ఉందని నలుగురు శంకరాచార్యులు చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి నారాయణ్ రాణె శనివారం విమర్శలు గుప్పించారు. అసలు హిందూ మతానికి శంకరాచార్యులు చేసిన సేవ ఏమిటని ఆయన ప్రశ్నించారు. 'ప్రధాని మోదీ, బీజేపీని రాజకీయ దృష్టితోనే చూస్తున్నారు. అయితే ఈ కార్యక్రమం పూర్తిగా మతానికి సంబంధించినది. ఇది మన ధర్మం. రాముడు మన దేవుడు. జరుగుతున్నదంతా ఆయన కోసమే' అని నారాయణ్ అన్నారు. రాణె వ్యాఖ్యలపై ఆదివారం విపక్షాలు భగ్గుమన్నాయి. ఆయనను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని, దీనిపై బీజేపీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని శివసేన (యూబీటీ) డిమాండ్ చేసింది. ఆ పార్టీ ప్రతినిధి సంజయ్ రౌత్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ హిందూ మతానికి శంకరాచార్య ఏం సేవ చేసారంటూ ప్రశ్నించిన రాణె మొత్తం హిందూ మతాన్నే అవమానించారని అన్నారు. నారాయణ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీయే బాధ్యత వహించాలని శరద్ పవార్ ఎన్సీపీకి చెందిన ఎంపీ సుప్రియా సూలే కోరారు. శంకరాచార్యులపై రాణె వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముంబైలోని నారాయణ్ పార్టీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు.





అయోధ్యలో ఏర్పాటు చేసిన హోమ గుండాలు

**ప్రాణప్రతిష్ఠ నాడు కళా ప్రదర్శనలు**

శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని సాంస్కృతిక శాఖ పలు ఏర్పాట్లు చేస్తున్నది. 2,500 మంది జానపద కళాకారులతో కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నగరవ్యాప్తంగా 100 వరకు స్టేజీ ప్రదర్శనలు ఉంటాయని తెలిపాయి. మరోవైపు దేశ, విదేశాలకు చెందిన 5 వేల మంది కళాకారులు అయోధ్యలో జనవరి 14 నుంచి మార్చి 24 వరకు 70 రోజుల పాటు వివిధ రకాల ప్రదర్శనలు ఇస్తారని అధికారులు తెలిపారు. 15 దేశాలకు చెందిన ఆర్టిస్టులు రామ్‌లీలా నాటకం ప్రదర్శిస్తారని వెల్లడించారు.

**రామచరిత మానస్‌కు డిమాండ్**

రామ మందిర ప్రారంభాన్ని పురస్కరించుకుని పవిత్ర గ్రంథం రామచరితమానస్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో అడిగినన్ని గ్రంథాలను సరఫరా చేయలేక తమ వెబ్‌సైట్ నుంచి ఈ గ్రంథాన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవడానికి గీతా ప్రెస్ అనుమతినిచ్చింది.

**75 ఎలక్ట్రిక్ వాహనాల ప్రారంభం**

అయోధ్య ప్రారంభోత్సవానికి వివిధ రాష్ర్టాల నుంచి వచ్చే భక్తులు, సందర్శకుల సౌకర్యార్థం కొత్తగా 75 ఎలక్ట్రిక్ వాహనాలను ఏర్పాటు చేశారు. వీటిలో 50 బస్సులు, 25 ఆటోలు ఉన్నాయి. వీటిని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించారు.

**ఊపందుకోనున్న ఆతిథ్య రంగం**

వారం రోజుల్లో రామమందిర ప్రారంభోత్సవ క్రమంలో అయోధ్యలో ఆతిథ్య రంగం జోరందుకుంది. రానున్న రోజుల్లో ఇక్కడకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారన్న అంచనాతో ఏర్పాటు చేయబోయే వ్యాపారాల్లో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు పలు ఒప్పందాలపై సంతకాలు చేస్తున్నారు. దేశంలోని ప్రముఖ హోటళ్లు ఇక్కడ తమ బ్రాంచీలు ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే 50కి పైగా పెద్ద హోటళ్ల నిర్మాణం ఇక్కడ జరుగుతున్నది.

## ప్రాణప్రతిష్ఠ లౌకికత్వానికి వ్యతిరేకం

**ముస్లింలెవరూ అందులో పాల్గొనొద్దు • ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్ పిలుపు**

న్యూఢిల్లీ, జనవరి 14: అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ లౌకిక విధానానికి వ్యతిరేకంగా ఉందని ముస్లిం పర్సనల్ లా బోర్డ్ చైర్మన్ హజ్రత్ మౌలానా ఖలీద్ సైఫుల్లా రెహమాన్ అన్నారు. ఆలయ ప్రారంభోత్సవంపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. జరుగుతున్న కార్యక్రమం రాజకీయ ప్రేరేపితంగా ఉందన్నారు. రామాలయ నిర్మాణంపై సుప్రీం కోర్టు తీర్పు తమ వారి మనసులను గాయపరిచిందని ఆరోపించింది. ఈ మేరకు ఒక ప్రకటన చేసూ హిందూ సోదరులకు మాత్రమే సంబంధించిన ఈ మతపరమైన కార్యక్రమంలో ముస్లింలు పాల్గొనరాదని పిలుపునిచ్చారు. 'రామ మందిర ప్రారంభోత్సవంపై ప్రభుత్వం, మంత్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రధాని రామ మందిరాన్ని ప్రారంభించడం న్యాయాన్ని, లౌకిక వాదాన్ని హత్య చేయడమే' అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. జనవరి 22న దీపాలు వెలిగించడండి.. జై శ్రీరాం నినాదాలు ఇవ్వండంటూ ప్రధాని పిలుపునివ్వడంపై ఆయన మాట్లాడుతూ ఇది కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే ముస్లింలు అర్థం చేసుకోవాలని అన్నారు. 'అయోధ్య రామ మందిర నిర్మాణంపై హిందూ సోదరులు ఆనందంతో దీపాలు వెలిగించుకోండి. మాకు అభ్యంతరం లేదు. ముస్లింలు మాత్రం ఈ కార్యక్రమంలో పాల్గొనకూడదు' అని ఆయన కోరారు. సుప్రీం కోర్టు తీర్పును ముస్లింలు గౌరవించినప్పటికీ అది వారి మనసులను మాత్రం గాయపరిచిందని ఆయన తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## సంజీవని దొరికేసిందా?!

**హిమాలయ మొక్కపై సాగుతున్న పరిశోధనలు**

**(స్పెషల్ టాస్క్ బ్యూరో)**

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): రామాయణంలోని సంజీవని ఔషధ మొక్క గురించి తెలియనివారు ఉండరు. అపస్మారక స్థితిలోకి చేరుకున్న లక్ష్మణుడిని పూర్వ స్థితిలోకి తీసుకురావడానికి హిమాలయాల నుంచి హనుమంతుడు ఈ మొక్కను తీసుకొచ్చినట్టు పురాణాల సారాంశం. అయితే ఇప్పటికీ హిమాలయాల్లోని ద్రోణగిరి ప్రాంతంలో ఈ మొక్క ఉన్నట్టు పలువురి నమ్మకం. దీంతో 2016లో ఈ ఔషధ మొక్కను వెదకడానికి ఉత్తరాఖండ్ ప్రభుత్వం రూ.25 కోట్లతో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. తీవ్రంగా శ్రమించిన ఆ బృందం 2020లో ఓ మొక్కను గుర్తించి ల్యాబ్‌లో పరీక్షలకు పంపించింది. ఇంతలో 'అదే సంజీవని మొక్క' అంటూ మీడియాలో కథనాలు ప్రసారమయ్యాయి. అయితే, రామాయణంలోని సంజీవని మొక్క అదేనా? అనే ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేదు. కారణం.. ఆ మొక్క గురించి ఇప్పటికీ పరిశోధనలు జరుగుతుండటమే. ఈ అంశంపై బృందంలో సభ్యుడైన మయారం ఉన్నియాల్ మాట్లాడుతూ.. తాము గుర్తించిన ఔషధ మొక్కకు కొన్ని రోగాలను మాత్రమే నయం చేసే గుణాలు ఉన్నాయని తెలిపారు. అయితే, ఇదే సంజీవని అని చెప్పడానికి మరికొన్ని ఆధారాలు సేకరించాల్సిన అవసరమున్నదని పేర్కొన్నారు. కాగా, రామాయణ కాలం నుంచి ఇప్పటివరకూ వాతావరణంలో ఎన్నో మార్పులు జరిగాయని, అందుకనే సంజీవని మొక్క ఇలా రూపాంతరం చెంది కొన్ని గుణాలు కోల్పోయిందని మరికొందరు వాదిస్తున్నారు.

## విద్యార్థులతో టాయిలెట్ల శుభ్రం

**కర్ణాటకలో ప్రిన్సిపాల్ నిర్వాకం**

బెంగళూరు, జనవరి 14: విద్యార్థులతో మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్న మరో ఘటన తాజాగా కర్ణాటకలో వెలుగు చూసింది. కలబురగిలోని ఒక పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులతోనే టాయిలెట్లు శుభ్రం చేయించడమే కాక, తన ఇంట్లోని తోట పనిని కూడా వారిచేత చేయించడంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. డైరెక్టరేట్ ఆఫ్ మైనారిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన మౌలానా ఆజాద్ మోడల్ స్కూల్స్‌లోని ఒక దానిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పాఠశాలలో చదువుతున్న విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇది వెలుగులోకి వచ్చింది. ప్రిన్సిపాల్ చేస్తున్న చర్యపై తాము నిలదీయగా, క్లీనింగ్ సిబ్బంది తక్కువగా ఉండటం వల్లే తానీ పని చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ చెప్పారని, ఆమె గత ఏడాదిగా విద్యార్థులతో ఈ పని చేయిస్తున్నదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇటీవల ఇలాంటి ఘటనలే కర్ణాటకలో రెండు వెలుగు చూశాయి. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

## పరిహారం పెంపు పరిశీలించండి

**'హిట్ అండ్ రన్'పై సుప్రీంకోర్టు సూచన**

న్యూఢిల్లీ : 'హిట్ అండ్ రన్(ప్రమాదానికి కారణమైన వాహనం పట్టించుకోకుండా వెళ్లిపోవడం)' ప్రమాద కేసుల్లో మరణించిన బాధితుల కుటుంబాలకు లేదా గాయపడిన వారికి ఇచ్చే పరిహారాన్ని ఏడాదికి ఒకసారి పెంచే విషయంపై పరిశీలన చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. హిట్ అండ్ రన్ ఘటనల్లో మరణించిన బాధితుల కుటుంబాలకు పరిహారంగా రూ.2 లక్షలు లేదా కేంద్ర ప్రభుత్వం సూచించిన అంత కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లించాలని మోటార్ వెహికల్స్(ఎంవీ) చట్టం-1988 చెబుతున్న విషయాన్ని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా గుర్తుచేసింది.

**పార్లమెంట్ భద్రత ఉల్లంఘన కేసు**

## ప్రధాన కుట్రదారు మనోరంజన్!

న్యూఢిల్లీ: పార్లమెంట్ భద్రత ఉల్లంఘన కేసులో మనోరంజన్‌ను ప్రధాన నిందితుడిగా పోలీసులు భావిస్తున్నారు. నిందితులపై జరిపిన నార్కో పరీక్షలకు సంబంధించి మరిన్ని నివేదికలు రావాల్సి ఉందని, మరికొంత మందిని దర్యాప్తు అధికారులు ప్రశ్నించాల్సి ఉందని పోలీస్ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. సాగర్, మనోరంజన్‌పై అదనంగా నార్కో టెస్టులు, బ్రెయిన్ మ్యాపింగ్ జరిపామని పోలీసులు పేర్కొన్నారు.

## కొత్త గబ్బిలం వైరస్ గుర్తింపు

న్యూఢిల్లీ, జనవరి 14: థాయిలాండ్‌లో గబ్బిలం జాతికి చెందిన కొత్త వైరస్‌ను గుర్తించారు. ఇది మనుషులపై ప్రభావం చూపే స్థాయిలో ఉన్నట్టు తెలుస్తున్నది. దీనిపై శాస్త్రవేత్తలు మరింత లోతుగా పరిశోధనలు చేస్తున్నారు. గతంలో కరోనా వైరస్ కూడా గబ్బిలాల నుంచే పుట్టినట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త వైరస్‌పై శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. అయితే ఈ కొత్త వైరస్‌ను గుర్తించిన థాయ్‌లాండ్‌కు చెందిన పరిశోధన సంస్థ ఎకో హెల్త్ అలియన్స్‌కు వివాదాస్పద సంస్థగా పేరుంది. గతంలో వూహాన్‌లో జరిగిన పరిశోధనలతో ఈ సంస్థకు సంబంధం ఉంది.

## భారత సైనికులకు మార్చి 15 డెడ్‌లైన్

**తమ దేశాన్ని వీడాలన్న మాల్దీవులు**

మాలే : భారత్-మాల్దీవుల మధ్య ఘర్షణ వాతావరణం తీవ్రమవుతున్నది. మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ మాయిజ్జు చైనా పర్యటన తర్వాత భారత్‌పై తన వ్యతిరేకతను మరింత పెంచారు. తమ దేశంలో ఉన్న 88 మంది భారత సైనికులు మార్చి 15 నాటికి తిరిగి వెళ్లిపోవాలని గడువు విధించారు. మాల్దీవుల ప్రెసిడెంట్స్ ఆఫీస్‌లో ప్రభుత్వ విధానాల విభాగం కార్యదర్శి నజీమ్ ఇబ్రహీం మాట్లాడుతూ, భారత సైనికులు మాల్దీవుల్లో ఇక కొనసాగకూడదన్నారు. ఇది మాల్దీవుల ప్రభుత్వ విధానమన్నారు.

**మాలే మేయర్ ఎన్నికల్లో భారత్ అనుకూల అభ్యర్థి గెలుపు**

భారత్‌కు వ్యతిరేకంగా.. చైనాతో దోస్తీ మొదలుపెట్టిన మాల్దీవుల అధ్యక్షుడికి గట్టి షాక్ తగిలింది. రాజధాని మాలే మేయర్ ఎన్నికల్లో భారత్ అనుకూల 'మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ' (ఎండీపీ) ఘన విజయం సాధించింది. ఎండీపీ అభ్యర్థి అదామ్ అజిం కొత్త మేయర్‌గా ఎన్నికయ్యారని స్థానిక మీడియా పేర్కొన్నది. ఇంతకు ముందు నగర మేయర్‌గా ఉన్న ప్రస్తుత అధ్యక్షుడు మాయిజ్జు, గత ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందు మేయర్ పదవికి రాజీనామా చేశారు. మాల్దీవులు-భారత్ సంబంధాలు ఉద్రిక్తంగా మారిన వేళ అధ్యక్షుడు మాయిజ్జుకు వ్యతిరేకంగా మాలే మేయర్ ఫలితాలు వెలువడటం గమనార్హం.

## ఉగ్రవాదుల వేటకు 'ఆపరేషన్ సర్వ శక్తి'

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను పెంచేందుకు పాకిస్థాన్ ప్రణాళికలు రచిస్తున్న క్రమంలో అందుకు కౌంటర్‌గా భారత సైన్యం కీలక నిర్ణయం తీసుకొన్నది. ఉగ్రవాదుల వేటకు 'ఆపరేషన్ సర్వశక్తి' చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పీర్ పంజల్ పర్వత శ్రేణుల తోపాటు కేంద్ర పాలిత ప్రాంతమంతా ఉగ్రవాదుల ఆచూకీ కోసం భద్రతా బలగాలు విస్తృత గాలింపు చర్యలు చేపడతాయి. జమ్ముకశ్మీర్ పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్, ప్రత్యేక ఆపరేషన్ల దళం, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు సైన్యానికి సహకరిస్తాయని అధికారులు తెలిపారు. పీర్ పంజల్ పర్వత శ్రేణుల్లో ఉగ్రమూకలు చెలరేగుతున్న విషయం తెలిసిందే.

## నకిలీ డిగ్రీతో ఎదిగిన డీజీసీఏ డైరెక్టర్

**ఫిర్యాదున్నా చర్యలు శూన్యం**

బెంగళూరు : పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) డైరెక్టర్ రవీందర్ సింగ్ జమ్వాల్ నకిలీ మాస్టర్స్ డిగ్రీతో అంచెలంచెలుగా ఎదిగిపోయారు. ఈ విషయం బయటపడినప్పటికీ, ఆయన ఆ పదవిలో కొనసాగుతూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీనినిబట్టి ఆయనకు ఏ స్థాయిలో పలుకుబడి ఉందో అర్థం చేసుకోవచ్చు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, సిక్కింలోని ఈఐఐఎల్ఎం విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ (ఫిజిక్స్) చేసినట్లు ఆయన నకిలీ సర్టిఫికేట్‌ను సమర్పించినట్లు డీజీసీఏలోని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కార్యాలయానికి 2023 డిసెంబరు 1న ఫిర్యాదు అందింది. దీంతో అదే నెల 5న ఆ విశ్వవిద్యాలయానికి లేఖ రాశారు. రవీందర్ పేర్కొన్న డిగ్రీకి యూజీసీ గుర్తింపు లేదని, ఆ సర్టిఫికేట్ బూటకమని విశ్వవిద్యాలయం స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖలోని నావికా దళం విభాగానికి తెలియజేశారు. అయినప్పటికీ జమ్వాల్ తన విధులను కొనసాగిస్తూనే ఉన్నారు. ఆయన 11 సంవత్సరాలపాటు గోవాలోని ఐఎన్ఎస్ హంస డబోలిమ్ విమానాశ్రయంలో నావల్ ఏటీసీగా పని చేశారు. ఆ తర్వాత రిలయన్స్ కమర్షియల్ డీలర్స్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్)గా పని చేశారు. 2012 అక్టోబరులో డీజీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా చేరారు. యూపీఎస్సీ పరీక్షల ద్వారా 2016 మార్చిలో డీజీసీఏ డిప్యూటీ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా సెలెక్ట్ అయ్యారు. 2021లో డీజీసీఏ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం ఎయిర్ స్పేస్ అండ్ ఎయిర్ నేవిగేషన్ సర్వీసెస్ స్టాండర్డ్స్, ఫ్లైట్ స్టాండర్డ్స్ డైరెక్టరేట్ అధిపతిగా ఉన్నారు.

**• భక్తులతో నిండిన శబరిగిరీశుడి సన్నిధి**



శబరిమలలో సోమవారం జరిగే మకర జ్యోతి దర్శనానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ సమీపంలోని కొండపై నుంచి జ్యోతిని కనులారా చూడటానికి వీలుగా ఉండే ప్రదేశాలను ఎంచుకుని కూర్చున్నారు. ఆంక్షలు ఉన్నప్పటికీ, రెండు రోజుల నుంచి భక్తుల తాకిడి బాగా పెరిగింది. వీరందరికీ సజావుగా మకర జ్యోతి దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు ప్రకటించింది.



## వివేక్ రామస్వామి అవినీతిపరుడు: ట్రంప్

వాషింగ్టన్, జనవరి 14: అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడుతున్న భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామిపై మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనకు ఓటు వేయవద్దని తన మద్దతుదారులను కోరారు. వివేక్ రామస్వామి అవినీతి పరుడని, ఆర్థిక నేరగాడని ట్రంప్ ఆరోపించారు. మోసపూరిత ప్రచారాలతో తన అనుచరుల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి వివేక్ రామస్వామి, ట్రంప్ మధ్య ఇప్పటివరకు స్నేహపూర్వక పోటీ సాగింది. 'ట్రూత్ సోషల్ పోస్ట్'లో ట్రంప్ చేసిన విమర్శలపై వివేక్ స్పందిస్తూ, 'ఎన్నికల సలహాదారుల మాట విని ట్రంప్ నాపై ఆరోపణలు చేయటం దురదృష్టకరం. దీనికి ప్రతిగా ఆయనపై మాటల దాడికి దిగదలుచుకోలేదు' అని అన్నారు.




## బ్యాటరీలు తినిపించి చిన్నారి హత్య

న్యూఢిల్లీ: స్నేహితుడి కూతురికి బ్యాటరీలు, స్క్రూలు తినిపించి దారుణంగా హత్య చేసిన యువతిని అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలు అలేసియా బటన్ రూపంలో ఉండే బ్యాటరీలు, స్క్రూలు, నెయిల్ పాలిష్ రిమూవర్ వంటి వాటిని 18 నెలల వయస్సు కలిగిన తన స్నేహితుడి కుమార్తె ఐరిస్ రిటా అల్ఫేరాకు తినిపించి ఈ హత్యకు పాల్పడింది. గత ఏడాది జూన్‌లో పెన్సిల్వేనియా రాష్ట్రంలో ఈ దారుణ ఘటన జరిగింది. రక్తంలో ప్రాణాంతక స్థాయిలో అసిటోన్ చేరిన కారణంగా చిన్నారి అవయవాలు చెడిపోయి మరణించినట్టు శవ పరీక్షలో తేలిందని పెన్సిల్వేనియా అటార్నీ జనరల్ మైఖెల్ హెన్రీ ప్రకటించారు. దీంతో నిందితురాలిని పోలీసులు అరెస్టు చేశారు. పాపను హత్య చేసే ముందు నిందితురాలు చిన్నారికి తినిపించిన వస్తువుల హానికరమైన ప్రభావాలను తెలుసుకొన్నదని విచారణలో తేలింది.

## పరిసరాల పచ్చదనం.. ఎముకలకు బలం!

హస్సెల్ట్ (బెల్జియం), జనవరి 14: పచ్చదనానికి, ఎముక పటుత్వానికి సంబంధం ఏంటి? పరిసరాల పచ్చదనం అధికంగా ఉన్న చోట నివసించే వారి ఎముకలు బలంగా ఉంటాయా? అంటే అవుననే అంటున్నారు బెల్జియం పరిశోధకులు. 'వయసుపై పర్యావరణ ప్రభావం' అనే అంశంపై బెల్జియంలో 4-6 ఏండ్ల వయస్సు కలిగిన 327 మంది పిల్లలపై ఫ్లాండర్స్ రీజియన్‌లో ఈ పరిశోధనలు నిర్వహించారు. ముఖ్యంగా వారి ఎముకల పటిష్ఠతను పరిశీలించారు. ఎముకలోని ఖనిజ సాంద్రత కనుగొనడానికి వారు క్వాంటిటేటివ్, అల్ట్రా సోనోగ్రఫీ లాంటి విధానాలను వినియోగించారు. ఎముకల సాంద్రత పిల్లల వయసు, బరువుతో పెరుగుతుందని... విటమిన్లు తీసుకోవడం, పాలు తాగడం, లింగం, బరువు, స్క్రీన్ టైం, సప్లిమెంట్లు వంటి ఇతర కారకాల ప్రభావం పెద్దగా ఉండదని తెలుసుకున్నారు. 25 శాతం పచ్చదనం అధికంగా ఉన్న ప్రాంతాలకు వెయ్యి మీటర్ల పరిధిలో నివసించే పిల్లల ఎముకల సాంద్రత తక్కువగా ఉండే అవకాశాలు 66 శాతం తగ్గింది. అంటే పచ్చదనం పిల్లల ఎముకల పటిష్టతపై విశిష్ట ప్రభావం చూపింది. అయితే అధ్యయనంలో పాల్గొన్న వారి లింగ భేదాలను ఇందులో పరిశీలించ లేదు. చిన్నతనంలోనే ఎముకల్లో బలం ఉంటే తర్వాత జీవితంలో మీరు మరింత దృఢంగా మారుతారని పరిశోధనలో పాల్గొన్న హస్సెల్ట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ టిమ్ నారోట్ పేర్కొన్నారు.





## క్యాన్సర్ చికిత్స వల్ల పెద్ద పేగులో మంట!

మిచిగాన్ (అమెరికా): ఇమ్యూన్ బేస్డ్ క్యాన్సర్ చికిత్స అనంతరం తీవ్రమైన గ్యాస్ట్రో ఇంటెస్టినల్ (జీర్ణ వ్యవస్థ సంబంధిత) సమస్యలు వస్తాయని యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్ హెల్త్ రోగెల్ క్యాన్సర్ సెంటర్ పరిశోధకులు గుర్తించారు. దీంతె అవాంఛనీయ సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా చికిత్స చేసే ఇమ్యూనో థెరపీ పద్ధతిని కనుగొన్నారు. సీనియర్ స్టడీ ఆథర్ గాబ్రియెల్ నునెజ్ మాట్లాడుతూ, మెకానిజాన్ని అర్థం చేసుకోవడం వల్ల మరింత ప్రయోజనాత్మకమైన ప్రత్యామ్నాయ థెరపీని అభివృద్ధి చేయగలమనేదానికి ఇదొక ఉదాహరణ అని తెలిపారు. క్యాన్సర్ ఇమ్యునో థెరపీ వల్ల పెద్ద పేగులో మంట పుట్టడానికి కారణమయ్యే మెకానిజాన్ని తాము గుర్తించామని, అనంతరం ఈ సమస్యను అధిగమించడానికి అవసరమైన మార్గాలను అభివృద్ధి చేశామని చెప్పారు. యాంటీ ట్యూమర్ ఎఫెక్ట్‌ను పరిరక్షిస్తూనే పెద్ద పేగులో మంటను నిరోధించే విధానాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు.




## నేటి నుంచి దావోస్ సదస్సు

న్యూఢిల్లీ, జనవరి 14: ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన 2,800 మందికి పైగా రాజకీయ నేతలు, భారత్ నుంచి 60 మంది ప్రముఖులు ప్రపంచ ఆర్థిక వేదిక 54వ వార్షిక సదస్సులో పాల్గొంటున్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో సోమవారం నుంచి ఈ సదస్సు ప్రారంభం కానుంది. సదస్సుకు భారత్ నుంచి ముగ్గురు కేంద్ర మంత్రులు, ముగ్గురు సీఎంలు సహా మొత్తం 100 మందికిపైగా రాజకీయ, పారిశ్రామిక ప్రముఖులు పాల్గొంటున్నారని తెలిసింది. ఐదు రోజులపాటు జరిగే సదస్సులో ప్రపంచ పర్యావరణం, గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం, ఉక్రెయిన్ సంక్షోభం, ఆర్థిక మాంద్యం..తదితర అంశాలపై ప్రభుత్వ నేతలు, ప్రైవేట్ వ్యక్తులు చర్చలు జరపనున్నారు. మొట్టమొదటిసారిగా దావోస్ సదస్సుకు 90కిపైగా దేశాలకు చెందిన జాతీయ భద్రతా సలహాదారులు హాజరయ్యారు. ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారంపై ఆదివారం చర్చించారు.